

పెద్దదర్గా ఉరుసుకు ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన కడప పెద్ద దర్గా ఉరుసుకు రావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ ఆహ్వాన పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.

జిల్లాకు త్వరలో కొత్త కలెక్టర్!

- తెలంగాణలో రిపోర్టు చేసిన శివశంకర్
- కొనసాగేందుకు ఫలించని యత్నాలు

ఈనాడు, కడప: జిల్లాకు కొత్త కలెక్టర్ నియామకం అనివార్యమైంది. ఖాళీ అయిన కలెక్టర్ పోస్టులో కొత్త వ్యక్తిని వెంటనే నియమించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇది వరకు కలెక్టర్‌గా పని చేసిన శివశంకర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ) విభాగం ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వానికి బుధవారం రిపోర్టు చేశారు. ఇక్కడే కొనసాగడానికి చేసిన ప్రయత్నాలు శివశంకర్‌కు ఫలించలేదు. డీవోపీటీ ఉత్తర్వులపై క్యాట్‌ను ఆశ్రయించినా ఉపశమనం దక్కలేదు. ఫలితంగా తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్‌లో సహచరులతో కలిసి పిటిషన్ దాఖలు చేసినప్పటికీ చుక్కెదురైంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో డీవోపీటీ ఆదేశాలను అనుసరించి తెలంగాణ సీఎస్ వద్ద రిపోర్టు చేశారు. బుధవారం ఉదయమే కడప నుంచి శివశంకర్ హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ ఏడాది జులై 6న కలెక్టర్‌గా శివశంకర్ బాధ్యతలు స్వీకరించి మూడు నెలల పాటు మాత్రమే పని చేశారు. ఈ తరుణంలో కలెక్టర్ బాధ్యతలన్నీ జేసీ అదితిసింగ్ బుధవారం నిర్వహించారు. తుపాను ప్రభావంపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితిలో జిల్లాకు వెంటనే కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించాల్సి ఉంది. కొత్త కలెక్టర్‌పై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా అదితి సింగ్

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా జేసీ అదితిసింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ శివశంకర్‌ను రాష్ట్రం నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

జలఖడ్గం

- జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, బద్వేలు తదితర ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపింది. విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. జడివానతో ఎప్పుడు ఎలాంటి ముంపు ముప్పు ముంచుకొస్తుందోనని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అష్టకష్టాలు పడి కంటికి రెప్పలా కాపాడు కుంటున్న పచ్చని పంటలకు వాన పోటు తప్పలేదు. పంటలు సాగు చేసిన రైతులకు అపార నష్టం వాటిల్లింది. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. జలాశయాల్లోకి వరదనీరు చేరుతోంది. - న్యూస్‌టుడే, కడప, గ్రామీణ, జిల్లా సచివాలయం, జిల్లా బృందం


జంగాలపల్లెలో నీటమునిగిన కంది పంట


ఒంటిమిట్ట మండలం పట్రపల్లిలో నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు సంటెయ్య



నేలవాలిన అన్నదాతల ఆశలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు 29 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట, వెన్ను, కోత దశలో పంట ఉంది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా జడివాన కురవడంతో వాలిపోయి చేతికి వచ్చే పంట ఒరిగిపోయింది. మరో వారం, 10 రోజుల్లో నూర్పిడి చేయాల్సిన పైరు నేలపాలు కావడంతో కర్షకులు కంట తడి పెడుతున్నారు. ధాన్యం తడిసి మొలకెత్తున్నాయి. వరి రైతులకు నష్టం బాగా జరిగింది. చామంతి, బంతి పూల తోటలు కూడా కొంతమేర దెబ్బతిన్నాయి. పక్వానికి వచ్చిన బొప్పాయి కాయల కోత ఆగిపోవడంతో చెట్ల పైనే మాగిపోతున్నాయి. మినుము 254.5 ఎకరాలు, వరి 2,024.2 ఎకరాల్లో నేలకొరిగిందని వ్యవసాయాధికారులు అంచనావేశారు.


రాజుపాలెంలో పత్తిపంటలో చేరిన వర్షపునీరు


వల్లూరు మండలంలో నేలవాలిన వరి


తప్పెట్ల వద్ద నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతులు

జలాశయాల్లోకి వరదనీరు


గండికోట జలాశయం నుంచి మైలవరానికి వరద జలాలు

జిల్లాలో 11 చిన్న, మధ్యతరహా, భారీ జలాశయాలున్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 77.288 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 57.387 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తెలుగుగంగ పథకంలోని ఎస్ఆర్-1లోకి 2,381 క్యూసెక్కులు చేరుతుండగా, బయటకు అంతే పరిమాణంలో విడుదల చేస్తున్నారు. ఎస్ఆర్-2లోకి 1,836 క్యూసెక్కులు వస్తుండగా, టీజీపీ ప్రధాన కాలువలోకి 1,791 క్యూసెక్కులు వదిలారు. గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయరుకు 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు ప్రస్తుతం 4900 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 2,500 క్యూసెక్కుల నీరు గండికోటకు చేరుతున్నట్లు వివరించారు. జలాశయంలో నీటి మట్టం పెరగకుండా రెండు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ వివరించారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈఈ ఆనంద నరసింహా మూర్తి బుధవారం తెలిపారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.9 టీఎంసీల నీటి నిల్వలున్నట్లు తెలిపారు.


విద్యుత్తు శాఖకు నష్టం

విద్యుత్తు తీగలు, స్తంభాలు, నియంత్రికలు తదితర పరికరాలు దెబ్బతిన్నాయి. జిల్లాలో రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కడప నగరం ఎన్జీవో కాలనీలో తీగలపై చెట్టుపడింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. బిల్టప్ సబ్‌స్టేషన్, శంకరాపురం 220 కేవీ సబ్‌స్టేషన్లలోకి నీరు వచ్చే అవకాశం ఉందనే సమాచారంతో ఎస్ఈ రమణ పరిశీలించారు. నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్షాలతో జిల్లాలో ఒక ఎద్దు, ఆవు, ఆరు గేదెలు, ఒక దూడ, పొట్టేలు మృత్యువాత పడ్డాయి.


కడప నగరంలోని ఎన్జీవో కాలనీలో విద్యుత్తు తీగలపై పడిన చెట్టు


మైదుకూరు మండలం భాగ్యనగరంలో మృతి చెందిన పశువు వద్ద బాధిత రైతు పాములేటి

జిల్లాలో నమోదైన వర్షపాతం (మి.మీ.లో)



సీజనల్ వ్యాధుల విజృంభణ

వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చాలామంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. జలుబు, దగ్గు, కీళ్లనొప్పులు, వైరల్ జ్వరాలతో చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు మంచం పట్టారు. మలేరియాతో 13 మంది, టైఫాయిడ్‌తో 363 మంది, డెంగీతో 295 మంది బాధపడుతున్నారు. నీరు కలుషితం కావడంతో డయేరియా బారిన 2,948 మంది పడ్డారు. ఇవన్నీ వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాలు మాత్రమే. అనధికారికంగా చూస్తే వీరి సంఖ్య మరింత రెట్టింపు ఉంటుందని అంచనా.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ అదితిసింగ్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె క్షేత్రస్థాయి అధికారులతో దృశ్యమాధ్యమంలో సమీక్షించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రాణ, పశునష్టం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఆశ్రయ కేంద్రాలను గుర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, వర్షాలు ఆగేవరకు ఎవరూ సెలవులు పెట్టొద్దని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని, 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.


చాపాడులో కుందూనది పాత వంతెన వద్ద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు


కడప బస్టాండులో వరదనీరు


నెమళ్లదిన్నె కుందూ నది వంతెనపై వరదనీటి ప్రవాహం

కడప... తప్పని మునక!

–న్యూస్‌టుడే, కడప నగరపాలక సంస్థ

కడప నగరంలోని వివిధ ప్రాంతాలను ముంపు బారి నుంచి కాపాడడానికి రూ.70 కోట్లతో వరద కాలువల నిర్మాణం చేపట్టామని వైకాపా నేతలు చెప్పిన మాటల్లో నిజమెంత? ఆ నిధులతో చేపట్టిన పనులు ఏమయ్యాయి?.. కడప నగరాన్ని మరోసారి వర్షాలు ముంచెత్తిన నేపథ్యంలో ఈ అంశాలపై నగరవాసులు చర్చించుకుంటున్నారు. కడప నగరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి అప్సరా థియేటర్ - ఆర్టీసీ బస్టాండు మార్గం జలదిగ్బంధమైంది. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండాల్సిన రహదారి చెరువులా మారింది. దీంతో పోలీసులు రాకపోకలు నిలిపేశారు. మేఘాలు మరోసారి గట్టిగా వర్షించాయంటే ఎన్జీఓ కాలనీ, భాగ్యనగర్ కాలనీలు నీటమునగక తప్పదు. ఈ ఒక్క మార్గమే కాదు... ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం, అక్కడి ప్రధాన రహదారి, మినీబైపాస్ రోడ్లు జలమయమయ్యాయి. ఎస్బీఐ కాలనీలోని రహదారులు సెలయేరులా మారాయి. కాలనీలోని రహదారులపై రెండడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. రూ.4 కోట్లతో వరద కాలువ నిర్మాణం చేపట్టినా కాలనీ వీధులు నీటమునగడం గమనార్హం. కాలువ పనులు పూర్తి చేయకపోవడంతో సమస్య తలెత్తుతోంది. రెండు వారాల కిందట కురిసిన వర్షాలకు కాలనీలోని వీధులు వరద నీటితో పరవళ్లు తొక్కాయి. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన అధికారులు వరద నీటిని మళ్లించడానికి ఒక కచ్చా కాల్వను తవ్వారు. దీని వల్ల కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినా చాలా చోట్ల సమస్య తీవ్రంగా ఉంది. కాలనీలోని వీధులను కలుపుతూ కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి వరకు వరద కాలువ నిర్మించారు. ఇక్కడ నుంచి 250 మీటర్ల మేర స్థలసేకరణ సమస్యతో పనులు నిలిచిపోవడంతో నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మోటారు ఏర్పాటు చేసి, వాటిని పక్కనున్న చిన్న కాలువలోకి ఎత్తిపోస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం కడప నగరంలో నిలిచిపోయిన కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తిచేయకుంటే కడప నగరానికి ముంపు సమస్య తప్పదని నగరవాసులు వాపోతున్నారు.


జలమయమైన కడప నగరంలోని ఎన్జీవో కాలనీ రహదారి


ముంపు బారిన ఎస్బీఐ కాలనీ

రాయలసీమను రతనాల సీమగా మార్చుతాం. ఉద్యాన పంటల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకొచ్చాం. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదంతో ముందుకెళుతున్నాం. ఉద్యోగం చేయడమే కాదు.. ఉద్యోగం ఇచ్చేలా వ్యవస్థను తీర్చిదిద్దుతాం. పెన్నా- వంశధార నదులను అనుసంధానం చేస్తాం. కొప్పర్తి పారిశ్రామిక వాడను ఉన్నతంగా తీర్చుదిద్దుతాం.
-నూతన పాలసీలపై బుధవారం ప్రకటన చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు

సీమ కష్టాలు చూశాం. సీమ కన్నీళ్లు తుడుస్తాం. సీమ జిల్లాలను ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు చిరునామాగా మారుస్తాం. ప్రత్యేకించి హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్ది ఉద్యాన రైతులకు అండగా నిలుస్తాం. 'మిషన్ రాయలసీమ' పేరిట పథకాలు ప్రకటిస్తున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో హామీలు నెరవేరుస్తాం. మీ కన్నీళ్లు తుడవాలంటే వైకాపాకు ఇచ్చిన సంఖ్యాబలాన్ని తెదేపాకు ఇవ్వండి. అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తాం. -2023, జూన్ 7న కడపలో జరిగిన సభలో మిషన్ రాయలసీమ ప్రకటన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు

ఉందిలే మంచి కాలం ముందు ముందునా!

- యువత భవిష్యత్తును మార్చేలా విధానాలు
- హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు మార్గం సుగమం
- సీఎం ప్రకటించిన పాలసీలతో చిగురించిన ఆశలు

–ఈనాడు, కడప

ఉద్యోగం కోసం నువ్వెళ్లేది ఎక్కడికి?.. తెలంగాణా?.. కర్ణాటకా?.. తమిళనాడా?.. ఇది అటు అన్నమయ్య.. ఇటు వైఎస్ఆర్ జిల్లాల్లోని బీటెక్, డిగ్రీ చివరి ఏడాది చదివే విద్యార్థుల్లో ఏ ఇద్దరు కలిసినా ఎదురవుతున్న ప్రశ్న. గత పాలకుల హయాంలో ఉద్యోగావకాశాలకు కృషి చేయలేదు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పరిశ్రమలను తీసుకొచ్చి.. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రయత్నమంటూ జరగలేదు. శిక్షణ కేంద్రాలను మూసేసి యువతకు నైపుణ్యాలు అందకుండా చేశారు. అంకుర సంస్థలు మూతపడ్డాయి. పట్టభద్రుల్లో 24 శాతం నిరుద్యోగ రేటుతో అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలు ఉన్నట్లుగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక బయటపెట్టింది. పట్టభద్రుల్లో నిరుద్యోగిత అధికంగా ఉన్నట్లు వివిధ సంస్థలు తెలిపాయి. ఇలాంటి తరుణంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పాలసీలు ఊరట కలిగిస్తున్నాయి. దీంతో పాటు గతంలో మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన 'మిషన్ రాయలసీమ'లో భాగంగా ప్రకటించిన హామీలు కార్యరూపం దాల్చే విధంగా ప్రణాళిక రూపొందించారు. యువతతో పాటు రైతులకు, పెట్టుబడిదారులకు ఊరట కలిగించేలా తాజా విధానాలున్నాయి.


కొప్పర్తి పారిశ్రామికవాడ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

పర్యాటకాభివృద్ధి ప్రస్తావన వచ్చింది. టెంపుల్ టూరిజం, ఏకో టూరిజం, టైగర్ ఏకో టూరిజం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలున్నాయి. తద్వారా గండికోట, హార్సిలీహిల్స్ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. పర్యాటక పాలసీ ద్వారా కొత్త రూపు సంతరించుకోనుంది.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసే యజమానులకు 10 శాతం అధికంగా ప్రోత్సాహకాలందిస్తామని, ప్రత్యేకించి రాయలసీమకు ప్రాధాన్యమిస్తామని సీఎం చంద్రబాబు వివరించారు. దీంతో మామిడి, బొప్పాయి. దానిమ్మ, చీని, అరటి, టమాట తదితర పంటల సాగు చేసే రైతులకు ఉపయుక్తంగా ఉండనుంది. రెండు జిల్లాల్లో అరటి సాగు విస్తారంగా ఉంది. ప్రత్యేకించి అన్నమయ్య జిల్లాలో అరటి, బొప్పాయి, టమాట పంటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. అరటి ఎగుమతులకు ప్రోత్సాహకం అందించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. మామిడి, టమాట గుజ్జు పరిశ్రమలు తీసుకొస్తే గిట్టుబాటు ధరకు అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ మేరకు చంద్రబాబు స్పష్టత ఇచ్చారు.

కొప్పర్తిలో మెండుగా పరిశ్రమలు

రాయలసీమ జిల్లాలను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు చిరునామాగా మారుస్తామని సీఎం చంద్రబాబుతో పాటు గతంలోనే మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ కారిడార్ల ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి కృషితో పాటు ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ కంపెనీల ద్వారా యువతకు ఉపాధికి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామికవాడను ఇండస్ట్రియల్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు రూ.2,137 కోట్ల ఆర్థికసాయంతో 54 వేల మందికి ఉపాధి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయి. గనుల ఖిల్లాగా భాసిల్లుతున్న రెండు జిల్లాల్లో గనుల పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. తుది ఉత్పత్తి వరకు పూర్తి వ్యాల్యూచైన్ ఏర్పాటు, మైనింగ్ పనులు మనం రాష్ట్రం వాళ్లే చేసేలా నైపుణ్య శిక్షణ ఇవ్వడం తదితర చర్యలు తీసుకోనున్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

జిల్లా సచివాలయం : తుపాను నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు.



మహానందిపల్లెలో సిమెంటు రహదారికి శంకుస్థాపన చేస్తున్న తెదేపా నాయకుడు రితేష్‌రెడ్డి, నాయకులు

గ్రామాభివృద్ధే ధ్యేయం

కలసపాడు, న్యూస్‌టుడే: గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం పల్లె పండుగ చేపట్టిందని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మహానందిపల్లె, శంఖవరం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రితేష్‌రెడ్డి రూ.26 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌బీ, తహసీల్దారు మధురవాణి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రంతూ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి, నాయకులు డి.భూపాల్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, పి.బాలిరెడ్డి, దుగ్గిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్సు కోసం పరీక్షకు వెళ్లిన చోదకులను పాస్ చేయాలన్నా, ఫెయిల్ చేయాలన్నా.. బ్రేక్ ఇన్‌స్పెక్టరుదే తుది నిర్ణయం. ఈ విధానంలో అనేక అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో మానవ ప్రమేయం లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రొద్దుటూరులోని ఆర్టీవో కార్యాలయ ఆవరణలో రూ.3 కోట్లతో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. నవంబరు 15 నాటికి దీనిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ట్రాక్‌కు సెన్సార్లు ఉంటాయి. వాహనదారుడు నిబంధనల మేరకు వాహనాన్ని నడిపితే సెన్సార్ల ద్వారా అతను పాస్ అయినట్లు చూపిస్తుంది. ఏదైనా తప్పిదం చేస్తే వెంటనే ఫెయిల్ అని చూపిస్తుంది. ఈ విధానంలో ఎవరి సిఫార్సులు పని చేయవు. ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు చోటు ఉండదు.



డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నమూనా

కడపలో సొంతగూటికి చేరేదెప్పుడో?

జిల్లాలోని అన్ని కార్యాలయాలకు సొంత భవనాలు, సొంత డ్రైవింగ్ ట్రాక్‌లున్నా, జిల్లా కేంద్రమైన కడపలో మాత్రం ఇప్పటి వరకు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న డీటీసీ కార్యాలయం, డ్రైవింగ్ ట్రాక్ స్థలాలు పక్కనే ఉన్న కృషి విజ్ఞాన కేంద్రానికి సంబంధించినవి. సుమారు 15 ఏళ్ల కిందట అప్పటి డీటీసీ బసిరెడ్డి... రామకృష్ణ మఠం వద్ద అప్పటి కలెక్టరు అనుమతితో రవాణా శాఖకు పదెకరాల స్థలాన్ని తీసుకున్నారు. భూమి పూజ కూడా చేశారు. కానీ అది తమదంటూ అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది అధికారులు మారినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు, అధికారులైనా రవాణశాఖకు సొంత భవనం సమకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సుల్లో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీసెట్ - 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ జిల్లాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రాంతవాసులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో బుధవారం ఉదయం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి ప్రజల్ని నేరుగా కలుసుకుని వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తమకు వారసత్వంగా సంక్రమించిన 20 ఎకరాలు ఇనాం భూములను కొంతమంది ఆక్రమించారని కలసపాడు మండలం ముద్దంవారిపల్లికి చెందిన గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఈ చిత్రంలో రోడ్డు మధ్యలోని దిమ్మెపై ఉన్న విద్యుత్తు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ పరిస్థితి ప్రొద్దుటూరు కొర్రపాడు రోడ్డు రమణ మహర్షి పాఠశాల సమీపంలో ఉంది. ఈ మార్గం నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో అర్కటవేములకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొంది. అప్పటి నుంచి తిరిగి స్తంభాన్ని ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు తీగలను ప్రమాదకరంగా గాలికి వదిలేశారు. ప్రమాద సూచికగా దిమ్మెకు ఎరుపు రంగు గుడ్డను చుట్టినప్పటికీ తొలగిపోయింది. ఈ విషయమై ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనరు మల్లికార్జునను వివరణ కోరగా సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు**

పారదర్శకంగా ఇసుక రవాణా

కొండాపురం, న్యూస్‌టుడే: ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని తహసీల్దారు గురప్ప సూచించారు. ఈ మేరకు బుధవారం కొండాపురం మండలంలోని బెడుదూరు చిత్రావతినదిలో ఇసుక రీచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. స్టాక్‌పాయింట్ల వద్ద ఎలాంటి ఆలస్యం కాకుండా త్వరగా లోడ్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు మీనా, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, లక్ష్మమయ్య, భాస్కర్‌రెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



బెడుదూరు ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దారు గురప్ప, అధికారులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



జమ్మలమడుగు గ్రామీణ: అనంతగిరి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన **పూజారి రాజేష్** (30) మృతి చెందారు. ఈ నెల 1న జమ్మలమడుగు నుంచి ద్విచక్రవాహనంలో సున్నపురాళ్లపల్లెకు వెళ్తుండగా అనంతగిరి గ్రామ సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు, తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది, మెరుగైన వైద్యం కోసం మంగళవారం కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కల్పన పేర్కొన్నారు.

మేకల కాపరి ఆచూకీకి గాలింపు

అట్లూరు: అట్లూరు మండలంలోని కలవాండ్లపల్లెకు చెందిన మేకల కాపరి సొంట గంగిరెడ్డి అదృశ్యమై మూడు రోజులు అవుతున్నా ఆచూకీ లభించలేదు. కలవాండపల్లె, వరికుంట, ఎస్సీ కాలనీలకు చెందిన సుమారు 80 మంది బృందాలగా ఏర్పడి లంకమల అభయారణ్యం నుంచి సోమశిల వెనుక జలాల వరకు మేకల కాపరి కోసం జల్లెడ పట్టారు. ఎస్సై బి.రామకృష్ణ, సిబ్బంది గంగిరెడ్డి ఇంటి వద్ద కుటుంబు సభ్యులతో బుధవారం మాట్లాడారు. అనంతరం సిబ్బందితో అటవీ ప్రాంతంలో గాలించారు.

ఇసుక టిప్పరు పట్టివేత

పోరుమామిళ్ల: అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పరును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. మైదుకూరు పట్టణానికి చెందిన కుర్రా వెంకటేష్ టిప్పర్‌లో ఇసుకను కొండాపురం నుంచి కొమరోలుకు తరలిస్తుండగా మల్లకత్తువ చెక్ పోస్టు వద్ద బుధవారం తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మండలం కె.సుగుమంచిపల్లె గ్రామంలో సెబ్ అధికారులు ఆకస్మిక దాడిచేసి, అక్రమంగా నిల్వ చేసిన 24 మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు నేరవార్తలు: స్థానిక ఆటో నగర్‌లో జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ ఠాణా ఎస్.ఐ మహ్మద్ రఫీ తెలిపారు. వారి నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



మహానందిపల్లెలో సిమెంటు రహదారికి శంకుస్థాపన చేస్తున్న తెదేపా నాయకుడు రితేష్‌రెడ్డి, నాయకులు

గ్రామాభివృద్ధే ధ్యేయం

కలసపాడు, న్యూస్‌టుడే: గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం పల్లె పండుగ చేపట్టిందని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మహానందిపల్లె, శంఖవరం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రితేష్‌రెడ్డి రూ.26 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌బీ, తహసీల్దారు మధురవాణి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రంతూ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి, నాయకులు డి.భూపాల్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, పి.బాలిరెడ్డి, దుగ్గిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్సు కోసం పరీక్షకు వెళ్లిన చోదకులను పాస్ చేయాలన్నా, ఫెయిల్ చేయాలన్నా.. బ్రేక్ ఇన్‌స్పెక్టరుదే తుది నిర్ణయం. ఈ విధానంలో అనేక అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో మానవ ప్రమేయం లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రొద్దుటూరులోని ఆర్టీవో కార్యాలయ ఆవరణలో రూ.3 కోట్లతో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. నవంబరు 15 నాటికి దీనిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ట్రాక్‌కు సెన్సార్లు ఉంటాయి. వాహనదారుడు నిబంధనల మేరకు వాహనాన్ని నడిపితే సెన్సార్ల ద్వారా అతను పాస్ అయినట్లు చూపిస్తుంది. ఏదైనా తప్పిదం చేస్తే వెంటనే ఫెయిల్ అని చూపిస్తుంది. ఈ విధానంలో ఎవరి సిఫార్సులు పని చేయవు. ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు చోటు ఉండదు.



డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నమూనా

కడపలో సొంతగూటికి చేరేదెప్పుడో?

జిల్లాలోని అన్ని కార్యాలయాలకు సొంత భవనాలు, సొంత డ్రైవింగ్ ట్రాక్‌లున్నా, జిల్లా కేంద్రమైన కడపలో మాత్రం ఇప్పటి వరకు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న డీటీసీ కార్యాలయం, డ్రైవింగ్ ట్రాక్ స్థలాలు పక్కనే ఉన్న కృషి విజ్ఞాన కేంద్రానికి సంబంధించినవి. సుమారు 15 ఏళ్ల కిందట అప్పటి డీటీసీ బసిరెడ్డి... రామకృష్ణ మఠం వద్ద అప్పటి కలెక్టరు అనుమతితో రవాణా శాఖకు పదెకరాల స్థలాన్ని తీసుకున్నారు. భూమి పూజ కూడా చేశారు. కానీ అది తమదంటూ అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది అధికారులు మారినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు, అధికారులైనా రవాణశాఖకు సొంత భవనం సమకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సుల్లో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీసెట్ - 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.


మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ జిల్లాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రాంతవాసులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో బుధవారం ఉదయం నిర్వహించిన 'ప్రజా దర్బార్' లో మంత్రి ప్రజల్ని నేరుగా కలుసుకుని వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తమకు వారసత్వంగా సంక్రమించిన 20 ఎకరాలు ఇనాం భూములను కొంతమంది ఆక్రమించారని కలసపాడు మండలం ముద్దంవారిపల్లికి చెందిన గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఈ చిత్రంలో రోడ్డు మధ్యలోని దిమ్మెపై ఉన్న విద్యుత్తు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ పరిస్థితి ప్రొద్దుటూరు కొర్రపాడు రోడ్డు రమణ మహర్షి పాఠశాల సమీపంలో ఉంది. ఈ మార్గం నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో అర్కటవేములకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొంది. అప్పటి నుంచి తిరిగి స్తంభాన్ని ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు తీగలను ప్రమాదకరంగా గాలికి వదిలేశారు. ప్రమాద సూచికగా దిమ్మెకు ఎరుపు రంగు గుడ్డను చుట్టినప్పటికీ తొలగిపోయింది. ఈ విషయమై ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనరు మల్లికార్జునను వివరణ కోరగా సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు





పారదర్శకంగా ఇసుక రవాణా

కొండాపురం, న్యూస్‌టుడే: ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని తహసీల్దారు గురప్ప సూచించారు. ఈ మేరకు బుధవారం కొండాపురం మండలంలోని బెడుదూరు చిత్రావతినదిలో ఇసుక రీచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. స్టాక్‌పాయింట్ల వద్ద ఎలాంటి ఆలస్యం కాకుండా త్వరగా లోడ్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు మీనా, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, లక్ష్మమయ్య, భాస్కర్‌రెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.




బెడుదూరు ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దారు గురప్ప, అధికారులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



జమ్మలమడుగు గ్రామీణ: అనంతగిరి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన **పూజారి రాజేష్** (30) మృతి చెందారు. ఈ నెల 1న జమ్మలమడుగు నుంచి ద్విచక్రవాహనంలో సున్నపురాళ్లపల్లెకు వెళ్తుండగా అనంతగిరి గ్రామ సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు, తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది, మెరుగైన వైద్యం కోసం మంగళవారం కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కల్పన పేర్కొన్నారు.



మేకల కాపరి ఆచూకీకి గాలింపు

అట్లూరు: అట్లూరు మండలంలోని కలవాండ్లపల్లెకు చెందిన మేకల కాపరి సొంట గంగిరెడ్డి అదృశ్యమై మూడు రోజులు అవుతున్నా ఆచూకీ లభించలేదు. కలవాండపల్లె, వరికుంట, ఎస్సీ కాలనీలకు చెందిన సుమారు 80 మంది బృందాలగా ఏర్పడి లంకమల అభయారణ్యం నుంచి సోమశిల వెనుక జలాల వరకు మేకల కాపరి కోసం జల్లెడ పట్టారు. ఎస్సై బి.రామకృష్ణ, సిబ్బంది గంగిరెడ్డి ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో బుధవారం మాట్లాడారు. అనంతరం సిబ్బందితో అటవీ ప్రాంతంలో గాలించారు.

ఇసుక టిప్పరు పట్టివేత

పోరుమామిళ్ల: అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పరును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. మైదుకూరు పట్టణానికి చెందిన కుర్రా వెంకటేష్ టిప్పర్‌లో ఇసుకను కొండాపురం నుంచి కొమరోలుకు తరలిస్తుండగా మల్లకత్తువ చెక్ పోస్టు వద్ద బుధవారం తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మండలం కె.సుగుమంచిపల్లె గ్రామంలో సెబ్ అధికారులు ఆకస్మిక దాడిచేసి, అక్రమంగా నిల్వ చేసిన 24 మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు నేరవార్తలు: స్థానిక ఆటో నగర్‌లో జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ ఠాణా ఎస్.ఐ మహ్మద్ రఫీ తెలిపారు. వారి నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

APSFC

(1951 నాటి స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చట్టం LXIII క్రింద స్థాపించబడింది)
ప్లాట్ నెం. ఇ-I, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఫేజ్-II, జిల్లా కలెక్టరు ఆఫీసు నుండి రిమ్స్ రోడ్ వరకు, కడప-516 004, ఫోన్ నెం. 08562-295765, ఇమెయిల్ : kadapa@apsfc.com

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8(6) & 9(1)తో చదువుకొనేలా 2002 సర్ఫేసి చట్టం క్రింద చర/స్థిరాస్తుల అమ్మకం.

దిగువ వివరించిన చర మరియు స్థిరాస్తులు అనగా రుణదాతకు మార్టిగేజు చేసిన / చార్జీ చేసిన వాటిని రుణదాత వారి అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినవనీ, దిగువ వివరించిన రుణగ్రస్తుడు / హామీదారులు బకాయిపడి దిగువ వివరించిన మొత్తాలను వసూలు చేయుటకు సదరు స్వాధీనం చేసుకొన్న చర/స్థిరాస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడే", "ఉన్నది ఉన్నట్లే", "యథాస్థితి", "పునరాలోచన లేని" ప్రాతిపదికన తేదీ 18-11-2024న అమ్మబడునట్లుగా తెలుపుతూ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తులు మరియు హామీదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర, ఇఎండీ వివరాలు మరియు సెక్యూర్డ్ ఆస్తులపై తెల్సిన ఎన్‌కంబరెన్స్ వివరాలు క్రిందనివ్వడమైనది.

రుణగ్రస్తుడు/ హామీదారుడు	30-09-2024 నాటికి గల బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేదీ	స్వాధీనం తేదీ	రిజర్వు ధర (రూ.లక్షలలో)	ఇఎండి (రూ. లక్షలలో)	బిడ్ పెంపుదల మొత్తం (రూ. లక్షలలో)
మెసర్స్ శ్రీ వెంకటేశ్వర మెటాలిక్ జరీ వర్క్స్, యజమానురాలు : శ్రీమతి అవ్వారు అనూష, తండ్రి: శ్రీ అవ్వారు సుధాకర్, డో.నెం. 13/80, స.నెం. 262 పార్ట్, ఖాదరాబాద్, కొత్తపల్లి పంచాయతీ, ప్రొద్దుటూరు - 516362, వై.ఎస్.ఆర్. జిల్లా.	రూ. 78,02,123/- + తేదీ 01-10-2024 నుంచి దానిపై అయిన అదనపు వడ్డీ, ఇతర ఖర్చులు	07-03-2022	25-07-2022	రూ. 68.17 లక్షలు	రూ. 6.82 లక్షలు	రూ. 0.25 లక్షలు

ఆస్తి వివరాలు

నివాస భూమి మరియు భవనం విస్తీర్ణం 162.52 చ॥గ॥లు లేదా 3.358 సెంట్లు, స.నెం. 868/1లోది, డో.నెం. 39/525-4-1, రామాలయం రోడ్, అరవిందనగర్, కడప పట్టణం, వైఎస్ఆర్ కడప జిల్లా మరియు **హద్దులు : ఉత్తరం :** శ్రీ ఎ.వెంకటసుబ్బయ్య గారి భూమి, **దక్షిణం :** ఎ.సూర్యనారాయణ గారి భవనాలు, **తూర్పు :** శ్రీమతి హేమలత గారి భూమి, **పడమర :** రోడ్. (ఈ ఆస్తి శ్రీ అవ్వారు సుధాకర్, తండ్రి స్వర్గీయ ఎ.పిచ్చయ్య గారికి చెందింది, రిజిష్టర్డు సేల్ డీడ్ పత్రం నెం. 640/1999, తేదీ 18-02-1999 ద్వారా)

ఇ-వేలం జరిగే తేదీ & సమయం : ఇ-వేలం పోర్టల్ : https://www.bankauctions.in ద్వారా తేదీ 18-11-2024న మ॥ 3.00 గం॥ల నుంచి సా॥ 5.00 గం॥ల తర్వాత వరకు పరిమితిలేని 5 నిమిషాల సమయం ఆటో పొడిగింపుతో నిర్వహించబడును. ఆసక్తిగల పాటదారులు తమ బిడ్ సమర్పించే ముందు మరియు ఇ-వేలంలో పాల్గొనే ముందు ఇ-వేలంకు సంబంధించిన విపులీకరించిన నియమ నిబంధనలను వెబ్ పోర్టల్స్ : https://www.esfc.ap.gov.in https://bankauctions.in లలో చూడవల్సినదిగా కోరడమైనది.

EMDని NEFT/RTGS ద్వారా దిగువ ఖాతాకు చెల్లించవలెను: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎర్రముక్కపల్లి శాఖ, కడప, ఖాతా నెం. 156311110001158 (IFSC Code: UBIN0815632).

EMDని జతపర్చి టెండరు ఫారంలు స్వీకరించుటకు గల ఆఖరు తేదీ : 16-11-2024 నాటి సా॥ 5.00 గం॥లు.

ఇ-వేలం టెండరు ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం సాధారణ నియమ నిబంధనలు గల ఇ-వేలం బిడ్ పత్రాన్ని https://esfc.ap.gov.in మరియు https://bankauctions.in లలో లభించును.

ఇంకా ఏవిధమైన ఇతర వివరాలు, వివరణలు కావాల్సినచో ఔత్సాహిక బిడ్డర్లు అధీకృత అధికారి వారిని, మొబైల్ నెం. 99599-88306కు సంప్రదించవలెను.

తేదీ : 17-10-2024
స్థలం : కడప


సం/- అధీకృత అధికారి
APSFC, కడప శాఖ.

























(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు


కొండసుంకేసులలో జెండాను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జెండా పండగ

పెద్దముడియం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొండ సుంకేసుల గ్రామంలో దస్తగిరిస్వామి జెండా పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. దర్గాను విద్యుత్తు దీపాల అలంకరణతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి చదివింపులు చేశారు. బుధవారం తెల్లవారుజామున నుంచే గ్రామంలో జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టి మధ్యాహ్నానికి ముగింపు పలికారు. ఎస్‌ఐ సుబ్బారావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే : పోరుమామిళ్ల మండలంలోని కమ్మవారిపల్లె కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభిరామ స్వామి ఆలయం ప్రతిష్ఠామహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం అర్చకులు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ఆలయంలో వివిధ పూజలు చేశారు. కార్యక్రమానికి బ్రహ్మంగారిమఠంలోని అచలానంద ఆశ్రమం వ్యవస్థాపకులు విరజానంద స్వామి హజరై ప్రత్యేక పూజలు చేశారు.


పోరుమామిళ్ల ఆలయంలో ప్రసంగిస్తున్న విరజానంద స్వామి

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

అట్లూరు, న్యూస్‌టుడే : యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రెడ్డిపోగు నరసింహులు, గౌరవ అధ్యక్షుడిగా కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా చిట్టెం కంచిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక బుధవారం జరిగింది.

బద్వేలు గ్రామీణ: బద్వేలు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా దేవానందం, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, గౌరవ అధ్యక్షుడిగా సుబ్బరాజా, ఉపాధ్యక్షులుగా నరేష్, శివభారతి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

చినుకు... వణుకు!

తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

తుపాను ప్రభావంతో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంటలు నీట మునిగాయి. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణాల్లో నీరు నిలిచింది. కొన్ని చోట్ల ఇంటి గోడలు కూలిపోగా, ప్రభుత్వ కార్యాలయాల స్లాబుల నుంచి నీరు ఉరుస్తోంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పలు ప్రాంతాలను వారు పర్యవేక్షించారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు క్లస్టర్ బృందం


పోరుమామిళ్ల: కొత్రపాటిపల్లెలో కూలిన ఇంటి గోడ


దువ్వూరు: నీలాపురంలో కేపీ ఉల్లి పంటలో నిలిచిన వర్షపునీరు


జమ్మలమడుగు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో...


బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు


బి.కోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉరుస్తున్న వర్షపు నీరు

పారిశుద్ధ్య కార్మికులు తడవకుండా చర్యలు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పురపాలకలో పని చేస్తున్న 60మంది పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, ప్రజారోగ్య విభాగ అధికారి పెంచలప్పలు రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. తుపానుతో కురుస్తున్న వర్షాలతో పారిశుద్ధ్య కార్మికులు తడవకుండా చర్యలు చేపట్టారు.


రెయిన్‌కోట్ అందజేస్తున్న పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాసులరెడ్డి

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం!

2028, డిసెంబరు వరకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని లబ్ధిదారులకు భారీ ఊరట

-న్యూస్‌టుడే, కడప



కోనరాజుపల్లెలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (పాత చిత్రం)

'పేదల్లో రక్తహీనత సమస్యను అధిగమించాలి. పోషకాల లోపాలను నివారించాలి. బక్కజీవులు, బడుగుల ఆకలి తీర్చాలి. సంపూర్ణ పోషకాలు అందించాలి' అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. కరోనాతో కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకోవాలనే సదాశయంతో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనకు నాలుగేళ్ల కిందట శ్రీకారం చుట్టింది. తెల్ల కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలనేది పీఎంజీకేఏవై ముఖ్యోద్దేశం. వాస్తవంగా ఈ ఏడాది డిసెంబరు వరకు గడువు ఉండగా, పేదల నుంచి వస్తున్న విన్నపాలను పరిగణనలోకి తీసుకుని మరో నాలుగేళ్లపాటు కార్డులో నమోదైన ఒక్కొక్కరికి నెలకు అయిదు కిలోల చొప్పున ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా ఇవ్వనుంది. పేదల ఆహార భద్రతకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తున్నాయి.

★ వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 10,91,176 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. అందులో 32,76,098 మంది సభ్యులుగా నమోదయ్యారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కేంద్రం ద్వారా అంత్యోదయ అన్న యోజన పత్రాలు 75,580 (యూనిట్లు 2,11,346) ఇచ్చారు. బీపీఎల్‌ను పరిగణనలోకి తీసుకొని ఎన్ఎఫ్ఎస్ఏలో 9,05,059 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. వీటిల్లో 28,10,309 మంది ఉన్నారు. వీరికి గత నాలుగేళ్లుగా ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన అమలులో భాగంగా ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మధ్యలో కొన్ని నెలలపాటు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. కేంద్రం చొరవ తీసుకోవడంతో ఆ తర్వాత మళ్లీ కొనసాగించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పీఎంజీకేఏవైలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కూడా రెండు జిల్లాల్లో ఏఏవై కార్డులు 1,260 ఇవ్వగా, ఇందులో 1,849 మంది లబ్ధి పొందుతున్నారు. బియ్యం కార్డులను 1,08,824 ఇవ్వగా, వీటి ద్వారా 2,52,584 మంది పొందుతున్నారు.

★ గత వారంలో కేంద్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. పేద, బడుగు కుటుంబాల్లోని సభ్యుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య ఉందని, పోషకాహార లోపం ఉన్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆమాత్యులు చర్చించారు. ఉచిత బియ్యాన్ని 2028, డిసెంబరు వరకు ఇవ్వాలని అనుమతిచ్చారు. గతంలో సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేయగా, కేంద్రం ఆదేశాలతో గతేడాది సెప్టెంబరు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇవ్వాలని ముందుకొచ్చారు. సార్టెక్స్ రకంలో 15 శాతం, నాన్ సార్టెక్స్‌లో 25 శాతం నూకలుంటాయి. వీటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఇస్తున్నారు. ఇక సంపూర్ణ పోషక బియ్యం ఇవ్వాలని లక్ష్యంతో 100 కిలోల సార్టెక్స్ బియ్యంలో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి అందజేసేవిధంగా ముందుకొచ్చారు. ఇకపై సాధారణ బియ్యంలో ఇనుము, ఫోలిక్ యాసిడ్, బి-12 పోషకాలను మిశ్రమం చేసి నిర్దేశిత ప్రమాణాలతో సరఫరా చేసి చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

★ విపణిలో కిలో బియ్యం కొనాలంటే వ్యాపారులు రూ.50 నుంచి రూ.65 వరకు వసూలు చేస్తున్నారు. మార్కెట్లో ధరలు అమాంతంగా పెరగడంతో పేదలపై ఆర్థికంగా భారం పడుతోంది. కార్డుదారుల్లో ఎవరూ కూడా ఆకలి కేకలతో బాధపడరాదని సదాశయంతో మరో నాలుగేళ్ల పాటు బియ్యం ఉచితంగా ఇవ్వాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిన ఉత్తర్వులను అమలు చేయాలని అధికారులు ప్రణాళికను రూపొందించారు.

అంశం	వైఎస్ఆర్	అన్నమయ్య
మండలాలు	36	30
చౌక ధరల దుకాణాలు	1,239	1,123
మొత్తం రేషన్ కార్డులు	5,86,352	5,04,824
నమోదైన లబ్ధిదారులు	17,62,579	15,13,519
ఎన్ఎఫ్ఎస్ఏ-ఏఏవైకార్డులు	36,017	39,563
లబ్ధిదారుల సంఖ్య	99,100	1,12,256
ఎన్ఎఫ్ఎస్ఏ బియ్యం కార్డులు	4,93,908	4,11,154
లబ్ధిదారుల సంఖ్య	15,33,438	12,76,871
ఎన్ఎఫ్ఎస్ఏ మొత్తం కార్డులు	5,29,925	4,50,717
రాష్ట్రం ఇచ్చిన ఏఏవై కార్డులు	591	669
లబ్ధిదారుల సంఖ్య	848	1,001
రాష్ట్రం ఇచ్చిన బియ్యం పత్రాలు	55,386	53,438
లబ్ధిదారుల సంఖ్య	1,29,193	1,23,391
రాష్ట్రం ఇచ్చిన మొత్తం కార్డులు	56,427	54,107
రాష్ట్రం తరఫున లబ్ధిపొందేది	1,30,041	1,24,392

మా బిడ్డను కాపాడండయ్యా!

వారిది రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. కూలి పనులకు వెళ్తేనే పూట గడిచేది. అలాంటి ఇంటికి పెద్ద కష్టమొచ్చింది. ఒక్కగానొక్క కుమారుడి గుండెకు రంధ్రం పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదనను అనుభవిస్తోంది. తమ కుమారుడి గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటి వద్దే మందులతో నెట్టుకొస్తున్నారు. - న్యూస్‌టుడే, నందలూరు



నవీన్ తేజతో తల్లిదండ్రులు హరిప్రసాద్, స్వర్ణలత

గుండెలో రంధ్రంతో దెబ్బతిన్న అవయవాలు

మందులకూ డబ్బుల్లేక తల్లిదండ్రుల ఆక్రందన

దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఉమ్మడి కడప జిల్లా నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి హరిజనవాడకి చెందిన నాయనపల్లి హరిప్రసాద్, స్వర్ణలత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నవీన్‌తేజ (14) పుట్టిన కొన్ని రోజులకే తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెలో రంధ్రం ఉందనడంతో ఆందోళన చెందారు. పది కిలోల బరువు ఉంటేనే శస్త్రచికిత్స చేయడానికి వీలవుతుందని చెప్పడంతో వెనక్కి వచ్చేశారు. తిరిగి ఏడేళ్ల అనంతరం నిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా గుండెలో రక్తప్రసరణ సరిగా లేదని, ఊపిరితిత్తుల్లోకి రక్తం చేరుతోందని, అవయవాలు సైతం దెబ్బతింటున్నాయని, శస్త్రచికిత్స చేయలేమని.. చేసినా ప్రయోజనం లేదని తేల్చి చెప్పారు. దీంతో అప్పటి నుంచి కేవలం మందులతోనే నెట్టుకొస్తున్నారు.

★ నవీన్‌తేజ గతేడాది స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సమయంలో తల నొప్పితో బాధపడుతూ కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయగా మెదడులో కణితి ఉందని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలని చెప్పడంతో చేయించారు. నాలుగు అడుగులు నడిచినా ఆయాసంతో పడిపోతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు వెళ్తే తమకు పూట గడవదని, అలాంటిది తమ కుమారుడి మందులకు నెలకు రూ.6 వేలు వరకు ఖర్చవుతోందని వాపోతున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగామని, ప్రస్తుతం ఆర్థిక స్థోమత లేకపోవడంతో మందులు సైతం కొనలేని దుస్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

★ కొన్నేళ్ల కిందట తన భార్య స్వర్ణలతకు మెదడులో కణితి ఉండటంతో రూ.లక్ష ఖర్చు చేసి శస్త్రచికిత్స చేయించినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఇటీవల తమ కుమార్తె ఆరోగ్యం కూడా బాగోలేదని, ఆసుపత్రుల వెంట తిరుగుతూ కూలి పనులకు వెళ్లలేకున్నామని.. వేదనతో బతుకీడుస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించి తమ కుమారుడిని కాపాడాలని, ప్రభుత్వం పింఛను అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

దాతలు స్పందించి ఫోన్ చేయాల్సిన చరవాణి నంబరు : 9154991003

20న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలో అక్టోబరు 20న యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభ జరగనుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో బుధవారం మహాసభల కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను జరిపామన్నారు. పాలకులు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రాథమిక విద్యను నిర్వీర్యపరుస్తూ ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమస్యల సాధనకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం భవిష్యత్తులో పోరాటాలు చేసేందుకు ఈ మహాసభలు వేదికగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, కార్యదర్శి ఏజాస్‌అహ్మద్, ప్రభాకర్, కరీముల్లా, పెంచలయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా సత్వర చర్యలు



ఎన్జీవో కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో కడప నగరంలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి సూచించారు. కడప నగరంలో బుధవారం ఎన్జీవో కాలనీ, వై జంక్షన్, అప్సర కూడలి తదితర ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అదనపు కమిషనర్ రాకేశ్‌తో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక చేసిన నేపథ్యంలో ఎక్కడా నీరు నిలిచిపోకుండా, డ్రైనేజీలు బ్లాక్ కాకుండా చూడాలన్నారు. ప్రమాదకర నియంత్రికల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రొద్దుటూరులో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్సు కోసం పరీక్షకు వెళ్లిన చోదకులను పాస్ చేయాలన్నా, ఫెయిల్ చేయాలన్నా.. బ్రేక్ ఇన్‌స్పెక్టరుదే తుది నిర్ణయం. ఈ విధానంలో అనేక అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో మానవ ప్రమేయం లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రొద్దుటూరులోని ఆర్టీవో కార్యాలయ ఆవరణలో రూ.3 కోట్లతో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. నవంబరు 15 నాటికి దీనిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ట్రాక్‌కు సెన్సార్లు ఉంటాయి. వాహనదారుడు నిబంధనల మేరకు వాహనాన్ని నడిపితే సెన్సార్ల ద్వారా అతను పాస్ అయినట్లు చూపిస్తుంది. ఏదైనా తప్పిదం చేస్తే వెంటనే ఫెయిల్ అని చూపిస్తుంది. ఈ విధానంలో ఎవరి సిఫార్సులు పని చేయవు. ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు చోటు ఉండదు.

కడపలో సొంతగూటికి చేరేదెప్పుడో?

జిల్లాలోని అన్ని కార్యాలయాలకు సొంత భవనాలు, సొంత డ్రైవింగ్ ట్రాక్‌లున్నా, జిల్లా కేంద్రమైన కడపలో మాత్రం ఇప్పటి వరకు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న డీటీసీ కార్యాలయం, డ్రైవింగ్ ట్రాక్ స్థలాలు పక్కనే ఉన్న కృషి విజ్ఞాన కేంద్రానికి సంబంధించినవి. సుమారు 15 ఏళ్ల కిందట అప్పటి డీటీసీ బసిరెడ్డి... రామకృష్ణ మఠం వద్ద అప్పటి కలెక్టరు అనుమతితో రవాణా శాఖకు పదెకరాల స్థలాన్ని తీసుకున్నారు. భూమిపూజ కూడా చేశారు. కానీ అది తమదంటూ అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది అధికారులు మారినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు, అధికారులైనా రవాణాశాఖకు సొంత భవనం సమకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నమూనా

రామయ్య భక్తులకు అవస్థలు



తడిసిన షామియానా కింద భక్తులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం వస్తున్న భక్తులకు అవస్థలు తప్పడం లేదు. రామయ్య క్షేత్రంలో ముఖమండపం, అంతరాలయం, గర్భాలయం, విమాన గోపురం జీర్ణోద్ధరణ పనుల నేపథ్యంలో కల్యాణ మండపంలో బాలాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడ నీడ కోసం షామియానా వేశారు. నాలుగు రోజులుగా వాన కురుస్తుండడంతో షామియానా నుంచి నీరు కారుతుండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తితిదే అధికారులు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా, భారీ వర్షాలు కురిసినప్పుడు, ప్రకృతి విపత్తులకు తట్టుకునేలా సరైన ఏర్పాట్లు చేయడం లేదని పర్యాటకులు పేర్కొంటున్నారు. దీనిపై తితిదే సివిల్ విభాగం ఏఈ కె.అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తడిసిన షామియానాను తొలగించి, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సుల్లో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీసెట్ - 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంపీఈడీ సబ్జెక్టుల విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

టెట్‌కు 1,295 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో టెట్ మంగళవారం కొనసాగింది. మొత్తం 1,490 మందికి 1,295 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని జమాల్‌పల్లెకు చెందిన నాగలక్ష్మి (38) అనే మహిళ బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాగలక్ష్మి భర్త ఏడేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటున్నారు. కొద్దిరోజులుగా ఛాతికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా ఇసుక రవాణా



బెడుదూరు ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దారు గురప్ప, అధికారులు, నాయకులు

కొండాపురం, న్యూస్‌టుడే: ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని తహసీల్దారు గురప్ప సూచించారు. ఈ మేరకు బుధవారం కొండాపురం మండలంలోని బెడుదూరు చిత్రావతినదిలో ఇసుక రీచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. స్టాక్‌పాయింట్ల వద్ద ఎలాంటి ఆలస్యం కాకుండా త్వరగా లోడ్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు మీనా, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, లక్ష్మమయ్య, భాస్కర్‌రెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు రెండు రోజుల్లో రూ.4 కోట్ల మద్యం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. కడప ఎక్సైజ్ డిపో పరిధిలో మంగళ, బుధవారాలు సుమారు రూ.4 కోట్ల విలువైన మద్యాన్ని దుకాణదారులు తీసుకెళ్లారు. ఇప్పటి వరకు 60 మంది డిపో నుంచి సరకు తీసుకెళ్లారు. ప్రభుత్వం ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవడానికి వెసులుబాటు కల్పించడంతో కొన్ని చోట్ల పక్క పక్కనే ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలున్న ప్రాంతాల్లోనూ కొత్తవి కొనసాగిస్తున్నారు. కడప మున్సిపల్ పాఠశాల వద్ద రెండు, పాత బస్టాండు వంతెన కింద రెండు దుకాణాలను ప్రారంభించారు. కొత్త బ్రాండ్లు రావడంతో ఆయా చోట్ల మందుబాబుల రద్దీ పెరిగింది.

సీనియర్లకు మొండిచెయ్యి... జూనియర్లకు అదనపు బాధ్యతలు

✤ ఆర్టీసీలో వైకాపాతో అంటకాగిన వారికి ప్రాధాన్యం ✤ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యూనియన్లు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిబంధనలకు తూట్లు పొడిచారు. సీనియర్లకు కాదని జూనియర్లకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. యూనియన్ నాయకులు కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అంటకాగిన వారికి ఇప్పుడు అదనపు బాధ్యతలు అప్పగించడం పట్ల తీవ్ర చర్చ నడుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం సీనియర్లకు అప్పగించాలి. ఉన్నతాధికారులు మాత్రం సీనియర్లను కాదని ఎక్కడో జాబితాలో చివరలో ఉన్న జూనియర్లను తీసుకొచ్చి బాధ్యతలు ఇవ్వడంపై పలువురు గరంగరంగా ఉన్నారు. తక్షణం ఈ జీవోను రద్దు చేసి సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని యూనియన్ నాయకులు డిమాండు చేస్తున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : కడప నగరంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణకుమారి, సీనియర్ వ్యాయామ సంచాలకులు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికవ్వాలని సూచించారు. అండర్ 14 విభాగంలో పి.దేవశ్రీ, వర్షిత్, ఎస్.మహమ్మద్ ఆయూబ్, వెంకటనందన్, జోషిత్, మహమ్మద్ హుస్సేన్, అండర్-17 విభాగంలో ఎన్.నాగమోక్షిత, దేవిక, తుశాంత్, గురుయశ్వంత్, ముస్తాఫా, రేవంత్ ఎంపికయ్యారు.

ఏపీటీఎఫ్(అమరావతి) రాష్ట్ర కమిటీలో చోటు

కడప విద్య, న్యూస్‌టుడే : ఏపీటీఎఫ్(అమరావతి) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వైఎస్ఆర్ జిల్లాకు చెందిన ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 117 రద్దు, పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ బకాయిలు, ఉద్యోగోన్నతుల్లో అసంబద్ధాలు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తూనే, పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. త్వరలో 'సీపీఎస్ రద్దు గుర్తుకు తెస్తాం' కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

కడప డీఎఫ్‌వోగా వినీత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



వినీత్‌కుమార్‌కు పూలమొక్క ఇచ్చి అభినందనలు తెలుపుతున్న అటవీ అధికారులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప డీఎఫ్‌వోగా వినీత్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై కడపకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సందీప్‌కుమార్ పాడేరు బదిలీ అయిన విషయం విదితమే. వినీత్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో అటవీ, ఎర్రచందనం రక్షణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కడప నగరవనాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. డీఎఫ్‌వోను అటవీ అధికారులు, ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.59.38 లక్షలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా పండగకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని సొంత ఊళ్లకు తీసుకొచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల పరిధిలో 238 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఇవి ఈ నెల 8 నుంచి 11 వరకు తిరిగాయి. ప్రత్యేక బస్సు సర్వీసులతో ఆర్టీసీకి రూ.59.38 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ ప్రాంతీయ అధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి 26 బస్సులు, బెంగళూరు 69, హైదరాబాదు 54, చెన్నై 11, తిరుపతి 46, కర్నూలు 8, ఇతర ప్రాంతాలకు 24 చొప్పున ప్రత్యేక బస్సులు నడిపామని చెప్పారు. 70 శాతం ఆక్యుపెన్సీ నమోదైందని పేర్కొన్నారు.

పీబీఆర్ జలాశయం పరిశీలన

లింగాల, న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని పులివెందుల రెవెన్యూ డివిజన్ ఆర్డీవో భానుశ్రీ ప్రత్యూష సూచించారు. బుధవారం సాయంత్రం పెంచికల బసిరెడ్డి జలాశయాన్ని ఈఈ రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. జలాశయానికి వరదనీరు పోటెత్తితే దిగువకు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పెద్దకుడాల, ఇప్పట్లలో వరదనీరు గ్రామాన్ని ముంచెత్తే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం కామసముద్రం చెరువును పరిశీలించారు.

చలానాలు కట్టకుంటే వాహనాల జప్తు


ఏడురోడ్ల కూడలి వద్ద వాహనదారుల పత్రాలను పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒక వాహనంపై మూడు చలానాలు పెండింగ్‌లో ఉంటే దానిని జప్తు చేస్తామని కడప ఒకటో పట్టణ సీఐ రామకృష్ణ స్పష్టం చేశారు. కడప ఏడురోడ్ల కూడలి వద్ద బుధవారం సీఐ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులను ఆపి పత్రాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో ఏమైనా చలానా పెండింగ్‌లో ఉందా.. లేదా అని తనిఖీ చేస్తున్నారు. సీఐ మాట్లాడుతూ వాహనదారులు విధిగా తన వద్ద అన్ని రకాల పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కడప

•కడప •పులివెందుల •కమలాపురం

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

కమలాపురం, న్యూస్‌టుడే: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. బెంగళూరు - విజయవాడ జాతీయ రహదారి, కమలాపురం బైపాస్ రహదారి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా అందించే సరుకులు ప్రజలకు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలన్నారు. అనంతరం గంగవరం వద్ద ఉన్న పెన్నా, కుందూ, పాపఘ్ని నదుల ప్రవాహాన్ని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల: 8008573466
కమలాపురం: 8008573475

?: స్థానిక నాగరాజుపేటలోని తులశమ్మ ఆసుపత్రి నుంచి ఎన్జీఓ కూడలి వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుపైన చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తుంది. - ప్రతిమ, స్థానికురాలు

?: రాజారెడ్డి వీధిలోని డీసీసీ బ్యాంకు వెనుకవైపున ప్రధాన రోడ్డులో వారం రోజులుగా చెత్త నిల్వ చేశారు. దోమలు, ఈగలు అధికంగా వస్తున్నాయి. - సంధ్యారాణి, స్థానికురాలు

✓: ఆయా ప్రాంతాలను పరిశీలించి చెత్త తొలగిస్తాం. - నవీన్, పారిశుద్ధ్య అధికారి

?: మారుతీనగర్‌లోని వైస్సార్ పక్క సందులో మురుగు కాలువ స్తంభించి వర్షం నీరు రోడ్డుపైన నిలబడుతోంది. - రజని

✓: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - భరత్‌కుమార్, బాధ్యుడు

?: ఎర్రముక్కపల్లె చౌడమ్మ ఆలయం సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద ప్రజలు చెత్త వేస్తున్నారు. - రమణ, స్థానికుడు

✓: పరిశీలించి చర్యలు చేపడతాం - సచివాలయ సిబ్బంది

?: ద్వారకానగర్‌లో రైతు బజార్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డులోనే వక్షిన కారణాలుగా వృక్షాలు ఉన్నాయి. దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించండి - గాయత్రి, స్థానికురాలు

✓: పరిశీలించి వృక్షాలను తొలగిస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం. - నవీన్, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, మారుతీనగర్

?: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయి - సోమశేఖర్

✓: రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు తీసుకుంటాం - గంగులయ్య, పంచాయతీ కార్యదర్శి

?: కె.రాజుపల్లెలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అంధకారం అలముకుంది. - బయారెడ్డి, స్థానికుడు

✓: వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం - ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ - న్యూస్‌టుడే, చక్రాయపేట

తడిసి ముద్దయిన నగరం

☛ చెరువులను తలపిస్తున్న రోడ్లు

☛ పొంగుతున్న మురుగు కాలువలు

న్యూస్‌టుడే, చిన్నచౌకు, అరవింద్ నగర్, కడప విద్య

అల్పపీడన ప్రభావంతో కడప నగరంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అప్సర కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే రహదారి మొత్తం నీటితో నిండిపోయింది. దీనికి గతంలో మరమ్మతులు చేసినప్పటికీ జలమయం కావడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోయింది. కడప నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు మునిగిపోయింది. కడప శివారులోని నానాపల్లె సమీపంలోని పంటలు నీట మునిగాయి. ఆ ప్రాంత రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిల్టప్ సమీపంలోని పరమేశ్వర పాఠశాలకు వెళ్లే రోడ్డుపైకి భారీగా వర్షం నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. పాత చిన్నచౌకు రోడ్డు, భరత్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మురుగు వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉండడంతో మురుగంతా వర్షపు నీటితో కలుస్తోంది. నగర పాలక అధికారులు యంత్రాల ద్వారా నీటిని బయటికి పంపించడానికి యత్నించినా, వర్షం కురుస్తూనే ఉండడంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది.


కృపాకాలనీలో నిలిచిన వర్షపునీరు


వాన నీటిలో వాహనదారుల అవస్థలు


అప్సర కూడలి - కొత్తబస్టాండ్ వైపు వెళ్లే రహదారి మూసివేత


పరమేశ్వర పాఠశాలకు వెళ్లే దారి జలమయం


కడప నగర శివారులో ఇదీ పరిస్థితి


అశోక్‌నగర్‌లో....

ఆ చేదు జ్ఞాపకం భయపెడుతోంది!

కడప నగరపాలక, న్యూస్‌టుడే: 2001 అక్టోబర్ 16.. తెల్లవారుజామున బుగ్గవంక మహోగ్రంగా కడప నగరంపై విరుచుకుపడిన రోజు. ప్రజలు నిద్రావస్థలో ఉండగా బుగ్గవంక ముంచెత్తింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులయ్యారు. బుగ్గవంక పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు సర్వం పోగొట్టుకుని కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. మళ్లీ 2024 అక్టోబర్ 16న కడప నగరంపై కారుమేఘాలు కమ్మాయి. తెల్లవారుజామునుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో నగరవాసులు నాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తుకుచేసుకుని, మళ్లీ ఎలాంటి ఉపద్రవం వస్తుందోనని బెంబేలెత్తుతున్నారు.

నిలిచిన విద్యుత్తు ... పలు గ్రామాల్లో అంతరాయం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలో సాలాబాదు పంచాయతీలో రామకృష్ణాపురం సమీపంలో తూము బోటు కొండ ప్రాంతంలో విద్యుత్తు తీగలు బుధవారం వేకువజామున 3.30 గంటల సమయంలో తెగిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో మలకాటిపల్లె, పెన్నానగర్, విద్యానగర్, రామకృష్ణానగర్, చెర్లోపల్లి, నడింపల్లి, పోలుబుచ్చయ్యగారిపల్లె, మంగంపేట గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఒకవైపు జోరుగా కురుస్తున్న వర్షం, మరోవైపు చీకటితో దోమల దండు గ్రామీణులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. విద్యుత్తు లేకపోవడంతో తాగునీటి మోటార్లు కూడా పనిచేయలేదు. ఉదయం 11.30 గంటల తర్వాత సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం కూడా పలుమార్లు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తీగలు తెగిపోయినట్లు సమాచారం రాగానే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించామని ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

స్తంభించిన జనజీవనం


రెడ్డి కాలనీ రహదారిపై నిలిచిన వాననీరు

కమలాపురం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కమలాపురం నగర పంచాయతీలో పలు రహదారులు ముంపునకు గురయ్యాయి. సొసైటీకాలనీ, రెడ్డికాలనీ, పడమర వీధి, పాతకచేరి వీధి, కృష్ణానగర్, గాంధీనగర్, క్రాస్‌రోడ్డు, మాచిరెడ్డిపల్లె క్రాస్, పైడిమాన్‌కాలనీ, కె.అప్పాయపల్లె ఎస్సీ కాలనీ, మారుతీనగర్, బీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులపైకి వాననీరు చేరింది. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు అసంపూర్తిగా వదిలేయడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు


వీరపునాయునిపల్లెలో కూలిన ఇల్లు

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందులలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు క్రిష్టియన్‌కాలనీలో కౌన్సిలర్ కాంతమ్మ ఇల్లు బుధవారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు వరప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంటిని పరిశీలించారు.

వీరపునాయునిపల్లె: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని సోమా చలమారెడ్డికి చెందిన ఇల్లు బుధవారం కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి ప్రభాకర్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

వైవీయూ (కడప) న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభాకర్ రెడ్డి హాజరై కళాశాల అభివృద్ధికి రూ.4 లక్షలు అందజేశారు. కళాశాల అభివృద్ధికి పాటుపడతామని హామీ ఇచ్చారు. మరో పూర్వ విద్యార్థి అమెరికా న్యూజెర్సీలోని దావోస్ కెమికల్ కార్పొరేషన్ మేనేజర్ డాక్టర్ ఎం.సర్వేశ్వరరాజు కళాశాలకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సెక్రటరీ కె.చిన్నపరెడ్డి, పూర్వ విద్యార్థులు కె.రాజారత్నం ఐజాక్, వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్, ఏవో కె.రమణరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుల్లేక విద్యార్థుల అవస్థలు

తొండూరు, న్యూస్‌టుడే: ముద్దనూరు - పులివెందుల మార్గంలో సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పదో తరగతి కావడంతో సాయంత్రం 5 గంటల వరకు అదనపు తరగతులు ఉంటాయన్నారు. దీంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో చీకటి పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమయం ఇక్కడే గడిచిపోతోందని, చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నగదు రికవరీకి ఆదేశం

చెన్నూరు, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల సామాజిక తనిఖీ కార్యక్రమం బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. డ్వామా పీడీ నాగరత్నమ్మ సమక్షంలో తనిఖీ సిబ్బంది చేపట్టిన పనుల గుర్తింపు, చెల్లింపుల జాబితా, లోపాలు, సవరణలు, ప్రతిపాదనలపై గ్రామాల వారీగా సమాచారం సేకరించారు. ఇందులో భాగంగా మొత్తం పనులకు గాను రూ.12 వేల నగదు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. పనికి తగిన వేతనం అందించడం, అందరికీ పని కల్పించడం, లబ్ధి చేకూర్చాలని ఆ శాఖ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎంపీడీవో కిరణ్, ఎంపీఎం శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చండీహోమం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప నగరం అలంఖాన్‌పల్లిలోని దస్తగిరిపేటలో మానసదేవి మహాకాళి శక్తి పీఠం వద్ద బుధవారం చండీ హోమం నిర్వహించారు. అనంతరం అన్న వితరణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఆవుల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఈ హోమం నిర్వహించామని చెప్పారు. మానసాదేవి ఆధ్యాత్మిక సేవా సమితి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని కడప ఆహార భద్రత అధికారి హరిత సూచించారు. పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేసి ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆహార పదార్థాలలో కల్తీని సులువుగా గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ మాధవ, వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ కిషోర్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి... తల్లడిల్లుతున్న అన్నదాతలు

కమలాపురం, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో ఈదురు గాలులు, వర్షాల కారణంగా కమలాపురం మండలంలో వరి, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో పది రోజుల్లో కోతకు వచ్చే వరి నేలకొరగడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. ఇటీవల సాగు చేసిన మినుము పంటలో కూడా నీరు నిలవడంతో పంట దెబ్బతింటుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 997 ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాల కారణంగా ఇప్పటికే 350 ఎకరాల్లో వరి నేలకొరిగినట్లు అధికారులు గుర్తించారు. మరో రెండు రోజులు ఇలాగే వర్షం కురిస్తే మిగిలిన పంట కూడా నేలకొరిగి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలో ఇటీవల వెయ్యి ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అవి కూడా చిన్న మొక్కలుగా ఉండటంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికే ఖర్చులు అధికమయ్యాయని తిరిగి విత్తుకోవాలంటే తమ వల్ల కాదని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో సరస్వతి మాట్లాడుతూ.. కోత దశలో ఉన్న, పడిపోయిన వరి కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టి గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉండేందుకు 50 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మినుములో తెగుళ్ల నివారణకు 19,19,19, హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.


చింతరాజుపల్లెలో ఒరిగిన వరి వెన్నులను చూపుతున్న రైతు నరసింహులు

ఒంటిమిట్ట: కర్షకుల ఆశల పంట వర్షార్పణమైంది. ఆరుగాలం శ్రమ నేలపాలైంది. మరో వారం, పది రోజుల్లో కోతకు వస్తుందని ఆశించిన రైతులకు కన్నీరే మిగిలింది. ఒంటిమిట్ట మండలంలో చింతరాజుపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో 60 ఎకరాలు, కోనరాజుపల్లెలో 20, మంటపంపల్లె 5, నరసన్నగారిపల్లెలో 5 ఎకరాల్లో వరి పంట ఒరిగి నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గొట్టపు బావుల కింద సాగు చేశారు. కష్టపడి కాపాడుకున్నారు. ఇక తిండి గింజలకు కొదవ ఉండదని, పశువులకు కావాల్సినంత గ్రాసం లభిస్తుందని సాగుదారులు ఆశించారు. ప్రకృతి ప్రకోపంతో కోలుకోలేని గాయం తగిలింది. మూడు రోజులుగా నీటిలో నానడంతో మోసులొస్తున్నాయని రైతులు ఆక్రోశిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి రాయితీ మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మండలంలో 90 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు గుర్తించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పక్కన నాయకులు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. బుధవారం చెర్లోపల్లె పంచాయతీలో తెదేపా మండల సమన్వయకర్త, సర్పంచి గంగిరెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 17 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దారు అనురాధ, నాయకులు అన్నమయ్య, ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి, చీమలపెంట సర్పంచి ప్రతాప్‌రెడ్డి, మల్లేసురెడ్డి, నాగమల్లారెడ్డి, విజయసారధిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి


బీటెక్ రవి సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో బుధవారం తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో వైకాపాకు చెందిన సారెడ్డి గంగాధర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, భూమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పోచంరెడ్డి రఘునాథరెడ్డి, రమేష్‌తోపాటు మరో అయిదు కుటుంబాలు తెదేపాలో చేరారు. వారికి బీటెక్ రవి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేముల: ఎన్డీయే పాలనలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వి.కొత్తపల్లెలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. పీఆర్ఏఈ అబ్దుల్లా, కార్యదర్శులు గుర్రప్ప, నిత్యలక్ష్మి, తెదేపా నాయకుడు రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో బార్ మూసివేత

ఈనాడు, కడప: కమలాపురంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో నడుస్తున్న మద్యం దుకాణాన్ని తెదేపా నాయకులు మూసివేయించినట్లుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లుగా ప్రతిని మాధ్యమాల్లో ఉంచారు. అయితే ఫిర్యాదు ఎస్పీకి అందిచలేదని, కేవలం సామాజిక మాధ్యమాలకే పరిమితమైనట్లు మరో ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు పోలీసు వర్గాలు సైతం చెబుతున్నాయి. వాస్తవానికి బుధవారం బార్ మూతపడింది. పాత, కొత్త వ్యక్తుల భాగస్వామ్యంతో బార్‌ను గురువారం తెరవనున్నట్లు సమాచారం. ప్రస్తుత బార్ లైసెన్స్ వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

చింతకొమ్మదిన్నె: మండలంలోని బుగ్గలేటిపల్లెకు చెందిన ఉప్పు నాగేంద్ర ఇటీవల కువైట్‌లో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి బుధవారం పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తెదేపా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ గంధం మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ నిరసన

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: చుట్టు నివాసాలు, సమీపంలో ఆలయాలు, ప్రార్థనా మందిరాలు ఉండగా, మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారంటూ కడప ఎర్రముక్కపల్లె కూడలి వద్ద స్థానిక మహిళలు బుధవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు రద్దీగా ఉంటుందని, విద్యార్థులు, మహిళలు ప్రతి పనికి బయటికి రావాలని, ఇలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం పెడితే మందుబాబుల మధ్య ఎలా వెళ్లాలంటూ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ సీఐ రామకృష్ణ, తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎక్సైజ్ సీఐ కృష్ణ కుమార్‌లు వచ్చి వారితో మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ దుకాణం ఏర్పాటుకు అనుమతించబోమని స్పష్టం చేయడంతో వారు వెళ్లిపోయారు.


ఆందోళన చేస్తున్న మహిళలు

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం

లింగాల, న్యూస్‌టుడే: పార్నపల్లెలోని సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా బుధవారం వేదపండితుడు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో మహాస్నపనం, నారాయణ మూల మంత్ర హోమం, గణపతి, నవగ్రహ, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారుల కోలాటం ఆకట్టుకుంది.

నదిని తవ్వేస్తూ... ఇసుక దోచేస్తూ

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇసుకాసురుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. వేంపల్లెలోని పాపఘ్ని నది నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ అక్రమార్కులు పోలీసుల కళ్లుగప్పి ఇసుక తరలిస్తూ నదీమా తల్లికి గర్భశోకం మిగులుస్తున్నారు. కుమ్మరాంపల్లె, వేంపల్లెలోని గవిమల్లేశ్వరాలయం, కాపువీధి, కడప రోడ్డులోని పలు ప్రాంతాల్లో నది నుంచి అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి 12 గంటల నుంచి ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇసుకకు భారీ డిమాండు ఉండటంతో కొందరు దీన్నే ఆదాయ వనరుగా చేసుకుని లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. కొందరైతే ఇసుక తరలింపు కోసమే కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నారంటే ఇసుకతో వచ్చే ఆదాయం ఎంతో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు తరచూ దాడులు చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అక్రమార్కులు ఏదో ఒక మార్గంలో నదిలోకి ప్రవేశించి ఇసుకను తరలిస్తున్నారు. కొందరు తమ ట్రాక్టర్లు పోలీసులకు పట్టుబడకుండా రాత్రి వేళల్లో ప్రైవేటు సైన్యంగా వెళుతున్నారు. నదిలోకి ఇసుక తరలించేందుకు వెళ్లే క్రమంలో అక్రమార్కులు ఆయా రోజుల్లో విధుల్లో ఏయే అధికారులు ఉంటారని కూడా గమనిస్తూ ఇసుక తరలిస్తున్నారు. అవసరమైన సమయంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో అధికారులకు సిఫార్సులు చేయించుకుంటున్నారు.


వేంపల్లె గవిమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నది నుంచి ఇసుక అక్రమ రవాణా

కుమ్మరాంపల్లె నుంచి గిద్దలూరుకు: ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వేంపల్లె మండలం కుమ్మరాంపల్లె నుంచి ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ లారీతో పాటు గవిమల్లేశ్వరాలయం సమీపంలోని పాపఘ్నినది నుంచి ఇసుక తరలిస్తున్న మరో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పట్టణ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.